సాక్షి ఆదిలాబాద్

గురువారం • 25 • జనవరి • 2024



పట్టభద్రులే అధికం.. 8లో▸
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది మంది ఎమ్మెల్యేల్లో అధికంగా ఉన్నత విద్యనభ్యసించి పట్టాలు పొందినవారే ఉన్నారు. ఇద్దరు వైద్యులు కూడా ఉండడం గమనార్హం.



ఓటుతోనే సుపరిపాలన 8లో▸
2011 జనవరి 25 నుంచి జాతీయ ఓటరు దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అర్హులంతా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించడమే దీని ముఖ్య ఉద్దేశం.



వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఈదురు గాలులు వీచే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

గణతంత్ర దినోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు


మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం


ఆదిలాబాద్‌టౌన్: 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు హెడ్‌క్వార్టర్‌లో ఆరు ప్లాటూన్‌లతో పరేడ్ కవాతు నిర్వహించడం జరుగుతుందన్నారు. వేదికను సుందరీకరించాలని అధికారులను ఆదేశించారు. స్టాల్స్, శకటాలకు ఇబ్బందులకు కలగకుండా చూడాలన్నారు. ఎస్పీ వెంట రిజర్వు ఇన్‌స్పెక్టర్లు నవీన్, మురళి, కార్తీక్ ఉన్నారు.

బాలికలు ఉన్నతస్థానాలకు ఎదగాలి


మాట్లాడుతున్న క్షమా దేశ్‌పాండే

జైనథ్: బాలికలు అవకాశాలను అందిపుచ్చుకుంటూ జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆదిలాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే అన్నారు. బుధవారం మండలంలోని అడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బాలికల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు తమ హక్కులను గురించి తెలుసుకోవాలన్నారు. సమాజంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, బాలికల సంరక్షణ చట్టాలు, తదితర అంశాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుణవంత్‌రావ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్


పట్టా అందిస్తున్న ప్రొఫెసర్ మాయాదేవి

బేల: మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న మండలంలోని కాంఘర్‌పూర్ గ్రామానికి చెందిన గేడం ప్రవీణ్ ఈ నెల 23న ఉస్మానియా యూనివర్సిటీ హిందీ విభాగం నుండి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా సాధించారు. ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్ మాయాదేవి పర్యవేక్షణలో 'ఎక్సీసాదికే హిందీ ఉపన్యాస్ మే ఆదివాసీ జన్ జీవన్' అంశంపై పరిశోధన చేశారు. బుధవారం అధ్యాపకుడిని ఆ కళాశాల ఛైర్మన్ పవన్ కుమార్ అగర్వాల్, ప్రిన్సిపాల్ డా.వరప్రసాద్ రావు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ట్రెసా డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సర డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ రాహుల్ రాజ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బానోత్ రమేశ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు రాంరెడ్డి, నలంద ప్రియ, స్వాతి, తహసీల్దార్ శ్రీనివాస్, డెప్యూటీ తహసీల్దార్లు శ్రీవాణి, సాయి మహేష్, సంఘ బాధ్యులు ఎన్రాల విలాస్, ప్రేమ్ నివాస్, మధుసూదన్, శ్రీధర్ పాల్గొన్నారు.


కోర్ మీటింగ్‌లో అభివాదం చేస్తున్న బీజేపీ నేతలు (ఫైల్)

బీజేపీలో రచ్చ

- సిట్టింగ్ ఎంపీకే టిక్కెట్ అన్న నిర్ణయంపై అయోమయం
- కోర్ మీటింగ్‌లో 'సోయం' వ్యాఖ్యల దుమారం
- ఎమ్మెల్యేలు, ఇతర నేతల ప్రోద్బలమనే ప్రచారం
- పార్టీలో ఏకాభిప్రాయం లేదనే అభిప్రాయం

సాక్షి,ఆదిలాబాద్: బీజేపీలో రచ్చ మొదలైంది.. పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ అభ్యర్థి ఎవరనే విషయంలోనే ముఖ్య నేతల మధ్య విభేదాలు పొడసూపుతున్నాయి. మొన్నటివరకు సిట్టింగ్ ఎంపీకే టిక్కెట్ అనే ప్రచారం జరిగింది. దానిపై ప్రస్తుతం పార్టీలో ఏకాభిప్రాయం వ్యక్తం కావడం లేదన్న ప్రచారం జరుగుతోంది. మంగళవారం జరిగిన కోర్ కమిటీ సమావేశంలో అటు ఎంపీ సోయం బాపూరావు వ్యాఖ్యలు దుమారం లేపుతుండగా ఇటు ఎమ్మెల్యేలు అభ్యర్థి విషయంలో అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యం అన్నట్టుగా మాట్లాడటం విభేదాలను స్పష్టం చేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వ్యాఖ్యల దుమారం..

బీజేపీ కోర్ కమిటీ సమావేశం మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగింది. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నేతలతో పాటు రాష్ట్ర నేతలూ పాల్గొన్నారు. ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్, రామారావు పటేల్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఎంపీ సోయం మాట్లాడుతూ తాను బాగా పనిచేశానని పార్టీ భావిస్తే టిక్కెట్ ఇస్తుందని.. అలా కాదనుకుంటే ఇవ్వదని వ్యాఖ్యానించారు. ఈ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు డిమాండ్ పెరిగిందన్నారు. అయితే కొత్తగా కొందరు పోస్టర్లు వేసి, డిన్నర్లు ఇస్తున్నారని, అలాంటి వారిని పార్టీ గుర్తించదని, ఇతర పార్టీలో ఇది సాధ్యమని అనడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాను ఎంపీగా ఉన్నందునే పార్లమెంట్ పరిధిలో నాలుగు స్థానాల్లో పార్టీ ఎమ్మెల్యేలు గెలిచారని, మిగిలిన చోట్ల గట్టి పోటీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు దుమారం లేపుతున్నాయి. మరోవైపు ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్ మాట్లాడుతూ.. ఎంపీ అభ్యర్థి ఎవరనేది మా చేతిలో లేదనడం ప్రాధాన్యత సంతరించుకుంది. అభ్యర్థి ఎవరైనా పెద్ద ఎత్తున మెజార్టీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇలా ఎంపీ, ఎమ్మెల్యేల వ్యాఖ్యలు ఇప్పుడు పార్టీలో చర్చనీయంగా మారాయి. మొత్తంగా ఎన్నికలకు ముందు పార్టీలో ముఖ్య నేతల మధ్య విభేదాలను స్పష్టం చేస్తున్నాయి.

ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికలు!

పార్లమెంట్ ఎన్నికలు ఏప్రిల్‌లో జరగవచ్చనే సంకేతాలు వెలువడుతున్నాయి. రాష్ట్రంలో బీజేపీ సిట్టింగ్ ఎంపీలు తిరిగి పోటీ చేస్తారని కొద్దిరోజుల కిందట పార్టీలో చర్చ జరిగింది. తాజాగా ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో ఇటు పార్టీలో ఉన్న ఎస్టీ ముఖ్య నేతలు, పార్టీతో సంబంధం లేని ఇతరులు కూడా బీజేపీ నుంచి టిక్కెట్ ఆశిస్తూ ఆయా ఎమ్మెల్యేల ఫొటోలతో అన్నిచోట్ల ఫ్లెక్సీలు పెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానంగా నేతల ప్రోత్సాహంతోనే ఇదంతా జరుగుతుందనే ప్రచారం ఉంది. ఎన్నికలు సమీపిస్తుండగా పార్టీలో ఏకాభిప్రాయం లేదన్నది స్పష్టమవుతోంది. అయితే ఆయా ఎమ్మెల్యేలు వేర్వేరు అభ్యర్థులను ప్రోత్సహిస్తున్నారనే ప్రచారం పార్టీలో జరుగుతోంది. దీంతో ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యేలుగానే దీన్ని పరిగణించాలా? ఎమ్మెల్యేల మధ్య కూడా అభ్యర్థి ఎంపిక విషయంలో ఏకాభిప్రాయం ఉందా? అనే సందేహాలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి. ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ అభ్యర్థి ఎంపిక విషయంలో అందరి మధ్య ఏకాభిప్రాయం సాధించగలుగుతారా? అనేది వేచిచూడాల్సిందే.

డ్రాపౌట్స్ ఇక బడికి..


పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి

- కొనసాగుతున్న బడిబయటి పిల్లల సర్వే
- జిల్లాలో 6–14 ఏళ్లలోపువారు 436 మంది
- 15–19 ఏళ్లలోపువారు 114 మంది గుర్తింపు
- స్కూళ్లలో చేర్పించేందుకు సర్కారు చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన చిన్నారులు బడిబయట గడుపుతున్నారు. కొంత మంది ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువు మధ్యలోనే ఆపేసి కూలీనాలి చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరు పనిచేయకపోతే పూట గడవని కుటుంబాలెన్నో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది చిన్నారులు కూలీలుగా మారుతున్నారు. పశువులను మేపుతూ బడికి దూరమవుతున్నారు. అయితే విద్యాశాఖ ఏటా బడిబయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పిస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో లక్ష్యం నెరవేరడం లేదు. ఈ ఏడాది కూడా సీఆర్పీల ద్వారా సర్వే చేపడుతున్నారు. డిసెంబర్ 10 నుంచి ఈ నెల 10 వరకు మొదట సర్వే నిర్వహించారు. ఆ తర్వాత ఈ నెల 15 వరకు సర్వేను పొడగించారు. బడిబయట చిన్నారుల సంఖ్య పెరుగుతుండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 31 వరకు సర్వే నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 6 నుంచి 14 ఏళ్లలోపు చిన్నారులు 436 మంది, 15 నుంచి 19 ఏళ్లలోపు వారు 114 మంది మొత్తంగా 550 మంది చిన్నారులు బడిబయట ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

గతేడాది కంటే పెరిగిన సంఖ్య

బడిబయట చిన్నారుల సర్వే పకడ్బందీగా జరగడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది సీఆర్పీలు నామ్‌కే వాస్తేగా సర్వే చేసి చేతులు దులుపుకుంటున్నారు. సర్వే చేపట్టిన కొద్దీ పిల్లల సంఖ్య పెరుగుతూనే ఉంది. గతేడాది దాదాపు 200 లోపే పిల్లలు బడిబయట ఉన్నట్లు గుర్తించగా ఈసారి వారి సంఖ్య రెట్టింపయ్యింది. గుర్తించిన వారిని బడిలో చేర్పిస్తే వీరి సంఖ్య తగ్గాల్సి ఉన్నా మరింతగా పెరగడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బడిలో చేర్పించిన చిన్నారులు తిరిగి యథాస్థితికే చేరుతున్నారు. జిల్లాలో 6 నుంచి 14 ఏళ్ల పిల్లలు 436 మంది బడిబయట ఉన్నారు. అత్యధికంగా ఉట్నూర్‌లో 61 మంది, ఇంద్రవెల్లిలో 43, గుడిహత్నూర్‌లో 42, బోథ్‌లో 39, భీంపూర్‌లో 33, ఆదిలాబాద్‌అర్బన్‌లో 53 మంది ఉన్నట్లు గుర్తించారు. అత్యల్పంగా బేలలో 6, సిరికొండలో 7, తాంసిలో 8, జైనథ్‌లో 7, బజార్‌హత్నూర్‌లో 10 మంది ఉన్నట్లు గుర్తించారు. అయితే 15 నుంచి 19 ఏళ్లలోపు వారు జిల్లాలో అత్యధికంగా ఇంద్రవెల్లిలో 53, ఉట్నూర్‌లో 78, ఆదిలాబాద్‌అర్బన్‌లో 64, భీంపూర్‌లో 54, గుడిహత్నూర్‌లో 51 మంది, అత్యల్పంగా సిరికొండ, బేలలో 9, బజార్‌హత్నూర్‌లో 12, తలమడుగులో 15 మంది పిల్లలు ఉన్నట్లు సర్వేలో గుర్తించారు.

బడిలో చేర్పించడమే..

బడిబయట గుర్తించిన 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలను వయస్సును బట్టి కేజీబీవీలు, గురుకులాలు, యూఆర్‌ఎస్‌లలో చేర్పించేందుకు చర్యలు చేపట్టనున్నారు. 15 నుంచి 19 సంవత్సరాల వయస్సుగల వారిని ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ చదివించేలా చూస్తున్నారు. వృత్తి విద్యలో సైతం శిక్షణ అవకాశాలు కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి సమీపంలోని విద్యాసంస్థల్లో చేర్పించనున్నారు.

జిల్లాలో బడిబయట చిన్నారుల వివరాలు

మండలం	6–14 ఏళ్లలోపు	15–19 ఏళ్లలోపు
ఆదిలాబాద్‌రూరల్	38	06
ఆదిలాబాద్‌అర్బన్	53	11
బజార్‌హత్నూర్	10	02
బేల	06	03
భీంపూర్	33	21
బోథ్	39	05
గాదిగూడ	18	02
గుడిహత్నూర్	42	09
ఇచ్చోడ	16	03
ఇంద్రవెల్లి	43	10
జైనథ్	07	06
మావల	10	-
నార్నూర్	14	06
నేరడిగొండ	20	01
సిరికొండ	07	02
తలమడుగు	11	04
తాంసి	08	06
ఉట్నూర్	61	17
మొత్తం	436	114

పకడ్బందీగా సర్వే



బడిబయట చిన్నారుల సర్వే పకడ్బందీగా చేపడుతున్నాం. జిల్లాలో 6 నుంచి 14 ఏళ్లలోపు వారు 436 మంది ఉన్నారు. వీరి వయస్సును బట్టి సమీప పాఠశాలల్లో ఆయా తరగతుల్లో చేర్పిస్తున్నాం. 15 నుంచి 19 ఏళ్ల లోపువారిని ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ చదివేలా ప్రోత్సహిస్తున్నాం. ఈ నెల 31 వరకు సర్వే కొనసాగనుంది. – టి.ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్డు భద్రత, ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా ఎస్పీతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులపై ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. గత సమావేశంలో చర్చించిన రోడ్డు ప్రమాదాల నియంత్రణకు గుర్తించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారిపై నేరడిగొండ నుంచి కుప్టి వరకు, టోల్ ప్లాజా నుంచి నేరడిగొండ వరకు సర్వీస్ రోడ్డు,


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

గుడిహత్నూర్ నుంచి సీతాగొంది వరకు వెళ్లే దారిలో వేగ నిరోధకాలు, సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. భోరజ్ చెక్‌పోస్ట్ వద్ద సర్వీస్ రోడ్డు వైపు వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ఆర్ అండ్‌బీ రహదారిపై పులిమడుగు, ఇంద్రవెల్లి, శ్యామ్‌పూర్‌కు వెళ్లే రహదారిలో న్యారో బ్రిడ్జీల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి వేళల్లో వాహనదారులకు తెలిసే విధంగా రేడియం స్టిక్కర్లు అమర్చాలన్నారు. అన్ని శాఖల సహకారంతో ప్రమాదాలను నియంత్రించి ప్రజల ప్రాణాలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీస్ శాఖ ద్వారా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఆటో, లారీ డ్రైవర్లకు, మోటర్ సైకిల్ వాహనదారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య, డీఈ సురేష్ రాథోడ్, ఆర్డీవో స్రవంతి, పంచాయతీ రాజ్ ఈఈ మహావీర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఎంవీఐ శ్రీనివాస్, డీఎస్పీ శ్రీనివాస్, రవాణా, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్


'ఆ.. సారు'పై ఎందుకంత ప్రేమ?

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: 'ఆ సారుపై ఎందుకంత ప్రేమ?.. జైలుకెళ్లినా సస్పెండ్ చేయని వైనం', 'విద్యాశాఖ తీరుపై ఇంటెలిజెన్స్ ఆరా' శీర్షికలతో మంగళ, బుధవారాల్లో ప్రచురితమైన కథనాలకు జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. పక్షం రోజుల క్రితం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఆయనపై పోక్సో కేసు నమోదు కావడంతో పాటు జైలుకెళ్లాడు. అయినప్పటికీ విద్యాశాఖ అధికారులు అతడిని సస్పెండ్ చేయలేదు. 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు డీఈవో ప్రణీత స్పందించి బుధవారం సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER ADILABAD

డీఈవో జారీ చేసిన ఉత్తర్వు కాపీ

'దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి'


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్

ఎదులాపురం: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమ్మె విజయవంతానికి ఈ నెల 26న బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు కుంటాల రాములు, గాజేంగుల రాజు, జగన్ సింగ్, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలక దేవిదాస్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన రెడ్డి యువజన నేతలు

ఎదులాపురం: జిల్లా రెడ్డి యువజన విభాగం నేతలు బుధవారం ఎస్పీ గౌస్ ఆలంను మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఈ ఆదివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ఎస్పీని ఆహ్వానించారు. అనంతరం ఎస్పీని శాలువాతో సన్మానించారు. ఎస్పీని కలిసిన వారిలో నాయకులు క్యాతం శివప్రసాద్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ వివాదం

- అర్బన్ తహసీల్దార్ తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ రాజకీయ వివాదానికి దారితీసింది. 37 మంది లబ్ధిదారులకు చెక్కులు అందించేలా ఎమ్మెల్యే పాయల్ శంకర్ రోజువారి షెడ్యూల్‌లో పొందుపర్చారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వాటిని పంపిణీ చేసేందుకు పంపిణీకి ఎమ్మెల్యే హాజరు కాగా, ఆదిలాబాద్‌అర్బన్ తహసీల్దార్ సంపత్ శ్రీనివాస్ గైర్హాజరయ్యారు. ఆయనకు ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. అయితే అధికార పార్టీ నాయకుల ఒత్తిడితోనే తహసీల్దార్ కార్యక్రమానికి రాలేదనే ప్రచారం సాగింది. అధికారులు హాజరు కాకుండా అధికార పార్టీకి చెందిన ఓ నేత అడ్డుపడ్డట్లుగా బీజేపీ వర్గాలు చర్చించుకున్నాయి. అసహనానికి గురైన ఎమ్మెల్యే ఫోన్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఏం జరిగిందో తెలియదు కానీ.. తహసీల్దార్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. తాను కోర్టులో ఉన్నందువల్ల ఫోన్ రిసీవ్ చేసుకోలేని పరిస్థితి ఉందంటూ ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పారు. దీంతో చెక్కుల పంపిణీ కార్యక్రమం కొంత ఆలస్యంగా జరిగింది. ఇదిలా ఉండగా రెవెన్యూ అధికారుల తీరుపై ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. లబ్ధిదారులకు 11 నెలలుగా చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయని, జాప్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పెళ్లి సమయంలో ఇవ్వాల్సిన చెక్కులను వారి పిల్లలతో వచ్చినప్పుడు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. అనంతరం రాత్రి సమయంలో కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయమై ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

డీఈవోపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: కీచక ఉపాధ్యాయుడిని కాపాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీతపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విద్యా శాఖ ఏడీ నర్సిములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం జేఏసీ కన్వీనర్ బి.రాహుల్ మాట్లాడుతూ ఉట్నూర్ మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు అక్కడి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని, అతనిపై కేసు నమోదై జైలుకు వెళ్లినప్పటికీ విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేయకుండా మిన్నకుండటం సరికాదని మండిపడ్డారు. వెంటనే ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు వినోద్ కుమార్, అశోక్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి అశోక్, ఎస్‌వీఏ జిల్లా అధ్యక్షుడు సుజయ్, సంఘ బాధ్యులు నవీన్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.


ఏడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం

ఎదులాపురం: కక్షిదారులు పరస్పర అంగీకారంతో రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కోర్టు హాల్‌లో మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులకు రాజీమార్గ ప్రయోజనాలను వివరించాలని పోలీసు, ఆబ్కారీ అధికారులకు సూచించారు. సమావేశంలో న్యాయమూర్తులు దుర్గారాణి, ప్రమీలాజైన్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేశ్, డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కె.సత్యనారాయణ, అశోక్, నరేశ్‌కుమార్, ఆబ్కారీ సీఐ శ్రీనివాస్, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయమూర్తి వరప్రసాద్

క్లుప్తంగా

తాగినమైకంలో బంక్ మేనేజర్‌పై కత్తితో దాడి

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన హెచ్‌పీ పెట్రోల్ బంక్ మేనేజర్ రెడ్డిశెట్టి గణేష్‌పై మంగళవారం రాత్రి అదే గ్రామానికి చెందిన గుడిసెల నర్సాగౌడ్ తాగిన మైకంలో కత్తితో దాడి చేశాడు. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో గణేష్ అనే వ్యక్తి మేనేజర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి బంక్‌లో లావాదేవిలు చూస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన గుడిసెల నర్సాగౌడ్ తాగిన మైకంలో కత్తితో దాడి చేసి గాయపరిచాడు. వెంటనే గణేష్‌ను కుటుంబ సభ్యులు భైంసాలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలికను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆ బాలికను గత కొంత కాలంలో వేధింపులకు గురిచేయడంతో ఆ బాలిక తల్లి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో పెర్సపేన్ ఉత్సవాలు


కుల దేవుడితో గ్రామానికి వస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: పుష్యమాసం పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు ఆయా ఆదివాసీ గ్రామాల్లో కుల దేవత ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పెర్సపేన్(పెద్ద దేవుడు), జంగుబాయి, భీమల్ దేవుడికి పూజ నిర్వహిస్తున్నారు. బుధవారం మండలంలోని పొల్లుగూడ గ్రామంలో జుగ్నాక్ వంశీయులు పెర్సపేన్ పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ పూజలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి జుగ్నాక్ వంశీయులు హాజరయ్యారు. కులదైవమైన పెర్సపేన్ (పెద్ద దేవుడు)కి ప్రత్యేక పూజల మధ్య గ్రామం చుట్టు ప్రదక్షిణలు చేయించారు. ఈ కార్యక్రమంలో జుగ్నాక్ వంశీయులు జుగ్నాక్ జైతు, జుగ్నాక్ కాశీరాం, జుగ్నాక్ భారత్, గ్రామ పెద్దలు సిడాం జైతు, ఆత్రం శంకర్, కొరెంగా లింగు, జుగాది రావ్ ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం


క్రీడాకారులను సన్మానిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్: ప్రతిభ గల క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని రాష్ట్ర షూటింగ్ బాల్ సంఘం అధ్యక్షుడు రవికుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ క్రాంతి కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మాస్టర్ మైండ్ పాఠశాలలో జాతీయ స్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించిన రాష్ట్ర జట్టు క్రీడాకారులకు క్రీడా దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. ఈ నెల 26వ తేదీ నుంచి 28 వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో ఈ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి హరిచరణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అజయ్, కళ్యాణ్ ఉన్నారు.

పట్టభద్రులే అధికం..



- ఎమ్మెల్యేల్లో ఇద్దరు డాక్టర్లు
- శ్రీమంతుడు చెన్నూర్ ఎమ్మెల్యే వివేకానంద్
- రాష్ట్రంలోనే మొదటి స్థానం

సాక్షి, మంచిర్యాలడెస్క్: రాష్ట్ర వ్యాప్తంగా గత నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో అధిక శాతం ఎమ్మెల్యేలు ఉన్నత విద్యనభ్యసించి పట్టాలు పొందిన వారే ఉన్నారు. ఇద్దరు వైద్యులు కూడా ఉండడం గమనార్హం. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఈ నెల 24న రాష్ట్రంలోని ఎమ్మెల్యేలకు సంబంధించిన సమాచారాన్ని విడుదల చేసింది. ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా ఎమ్మెల్యేలపై ఉన్న కేసులు, విద్యార్హతలు, ఆస్తులు, వయస్సు వివరాలు వెల్లడించింది.

ఇద్దరు వైద్యులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గం నుంచి తొలిసారి బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన పాల్వాయి హరీష్‌బాబు ఎంఎస్ ఆర్థో అభ్యసించారు. కాగజ్‌నగర్‌లో సొంత ఆస్పత్రి ఉండగా.. కొంతకాలం వైద్యుడిగా పని చేశారు. చెన్నూర్ నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికైన గడ్డం వివేకానంద ఎంబీబీఎస్ అభ్యసించారు. తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన వ్యాపారంలో స్థిరపడ్డారు.

- బెల్లంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ బీకాం, మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిగ్రీ, ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఎంఏ, బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్, నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీఏ, ముథోల్ బీజేపీ ఎమ్మెల్యే రామారావు పవార్ బీఎస్సీ అభ్యసించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి విద్యార్హతలేవీ(నోఫార్మల్ ఎడ్యుకేషన్) పేర్కొనలేదు.

'సిరి'మంతుడు వివేక్



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 119 మంది ఎమ్మెల్యేల్లో చెన్నూర్‌కు చెందిన ఎమ్మెల్యే వివేకానంద్ రూ.606.67 కోట్ల స్థిర, చరాస్తులతో మొదటి స్థానంలో ఉన్నారు. వంద కోట్లకు పైగా ఆస్తులున్న క్లబ్‌లో ఏడుగురు ఉండగా వివేకానంద్ టాప్‌లో ఉండడం గమనార్హం.

ఖానా'పూర్ ఎమ్మెల్యే'

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు రాష్ట్రంలోనే అందరి కంటే పేద ఎమ్మెల్యే. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేల్లో ఆర్థిక స్థితి పరంగా పరిశీలిస్తే ఆయన వద్ద కేవలం రూ.24లక్షలు మాత్రమే ఆస్తులున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. హరీశ్ బాబు ఆస్తులు రూ.4.19 కోట్లు, వినోద్‌కు రూ.197.12, ప్రేంసాగర్ రావుకు రూ.54.13, కోవ లక్ష్మికి రూ.2.31 కోట్లు, పాయల్ శంకర్‌కు రూ.7.5కోట్లు, జాదవ్ అనిల్‌కు రూ.1.93 కోట్లు, మహేశ్వర్‌రెడ్డికి రూ.32.84 కోట్లు, రామారావుపవార్‌కు రూ.20.14 కోట్లు ఉన్నాయి.

వెడ్మ బొజ్జుపైనే కేసులు ఎక్కువ



రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలపై పలు కేసులు నమోద య్యాయి. ఆందోళనలు, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు, భూకబ్జాలు, మోసం, చెక్‌బౌన్స్, మారణాయుధాలతో గాయపర్చడం తదితర కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. కేసుల పరంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజాసింగ్‌లపై అత్యధికంగా 89 చొప్పున కేసులతో మొదటి స్థానంలో ఉండగా.. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేల్లో వెడ్మ బొజ్జు 52 కేసులతో రాష్ట్ర వ్యాప్తంగా మూడో స్థానంలో, జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నారు. పాల్వాయి హరీష్‌బాబుపై 9కేసులు, గడ్డం వినోద్‌పై 4, కొక్కిరాల ప్రేంసాగర్‌రావుపై 40, పాయల్ శంకర్‌పై 11, ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై 8, రామారావు పవార్‌పై 2 కేసులు ఉన్నాయి. గడ్డం వివేకానంద్, కోవ లక్ష్మి, జాదవ్ అనిల్‌కుమార్‌లపై కేసులేమీ లేవు.

సీనియర్ సిటిజన్ రామారావు పవార్



ఉమ్మడి జిల్లాలోని పది మంది ఎమ్మెల్యేల్లో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పవార్ వయస్సు పరంగా సీనియర్ సిటిజన్. ఆయన వయస్సు 69 సంవత్సరాలు. పిన్న వయస్కులు వెడ్మ బొజ్జు.. ఆయన వయస్సు 37 సంవత్సరాలు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే అత్యధిక వయస్కులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి(74) కాగా, పిన్న వయస్కులు నారాయణపేట్ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి(30) ఉన్నారు. హరిశ్ బాబు(44), వివేకానంద(66), వినోద్(67), ప్రేంసాగర్‌రావు(63), కోవ లక్ష్మి(53), పాయల్ శంకర్(52), జాదవ్ అనిల్‌కుమార్(49), మహేశ్వర్‌రెడ్డి(54).

విద్యాభివృద్ధి కోసం ఎంఐఎం ప్రత్యేక కృషి

- ఎమ్మెల్సీ రహిమత్ భేగ్ ఖాద్రి


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ

ఇచ్చోడ: మైనార్టీల విద్యాభివృద్ధి కోసం ఎంఐఎం ప్రత్యేక కృషి చేస్తుందని ఎంఐఎం ఎమ్మెల్సీ రహీమత్ భేగ్ ఖాద్రి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం జిల్లా పరిషత్ పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసి మాట్లాడారు. పది సంవత్సరాల నుంచి పదో తరగతి విద్యార్థుల కోసం ఆల్‌ఇన్ వన్ పుస్తకాలను ప్రత్యేకంగా ముద్రించి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఎంతో మంది పేద విద్యార్థులు ఈ పుస్తకాలను చదువుకుని మంచి మార్కులు సాధిస్తున్నారని తెలిపారు. ఎంఐఎం పార్టీ ద్వారా అందిస్తున్న ఆల్ ఇన్‌వన్ పుస్తకాలను విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బిక్కు, ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షుడు జావిద్ ఉన్నారు.

మాకు న్యాయం చేయండి సారూ..!

- సస్పెండైన భైంసా ఆర్టీసీ ఉద్యోగులు

భైంసాటౌన్: చిన్నచిన్న కారణాలతో తమకు డ్యూటీలు ఇవ్వకుండా, ఉద్యోగాల నుంచి తొలగించి ఆర్టీసీ డిపో అధికారులు తీరని అన్యాయం చేశారని, తమకు న్యాయం చేయాలంటూ భైంసా ఆర్టీసీ డిపోకు చెందిన పలువురు సస్పెండైన ఉద్యోగులు వాపోయారు. వివిధ కారణాలతో సస్పెండైన ఆర్టీసీ ఉద్యోగులు బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి చేరుకోగా, వీరిలో భైంసా డిపోకు చెందినవారు కూడా ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ గోడు వెల్లబోసుకున్నట్లు తెలిపారు. భైంసాకు చెందిన ఓఎస్ఎస్ రావు(కండక్టర్), జమీల్ (డ్రైవర్) సాక్షితో మాట్లాడుతూ.. బస్సులో అప్పటికే ప్రయాణికులు ఉండడంతో కార్గో పార్శిల్లు వేసుకోలేదనే కారణంతో భైంసా డిపో అధికారులు తమ ఇద్దరినీ 2021లో సస్పెండ్ చేయడంతోపాటు సర్వీస్ రిమూవల్ చేశారని వాపోయారు. భోజన్న(డ్రైవర్) మాట్లాడుతూ.. తనకు కంటిచూపు మందగించడంతో అనువైన విధులు అప్పగించాలని కోర్టు ద్వారా ఆర్డరు తెచ్చినా విధులు అప్పగించకుండా వేదిస్తున్నారని ఆరోపించారు. బాపురావు, మజర్ అహ్మద్ (శ్రామిక్/హెల్పర్)లను సైతం వారి ఆరోగ్య కారణాల రీత్యా విధులు అప్పగించాలని కోరితే, భారీ పనులు అప్పగించారని చెప్పుకొచ్చారు. దీంతో చార్జిషీట్ వేసి తమను రిమూవల్ చేశారని ఆరోపించారు. డిపో అధికారుల వేధింపులతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నామని వాపోయారు. దీంతో సీఎంను కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నామని, త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

- ప్రజాపాలనను ఓర్వలేకనే దుష్ప్రచారం
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క


సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్‌లు

కైలాస్‌నగర్: ఎన్నికలేవైనా కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం అర్ధరాత్రి పట్టణంలోని ఆర్ఎస్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు బేల మండల సర్పంచ్‌లు, పట్టణ నాయకులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి కండువాలను కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్న తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. పదేళ్ల అధికారం అనుభవించిన బీఆర్ఎస్ నాయకులు ప్రతిపక్షంలోకి వచ్చే సరికి మతిభ్రమించి మాట్లాడుతున్నారని, రేవంత్‌రెడ్డి ప్రజాపాలనను ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయన్నారు. పార్టీపై నమ్మకంతో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు పెరుగుతున్నాయన్నారు. తమ పార్టీ కార్యకర్తల జోలికొస్తే గొయ్యి తీసి పాతిపెడతామని హెచ్చరించారు. పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి శ్రీనివాస రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, జైనథ్ జెడ్పీటీసీ వెంకట్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్లాట్ల కొనుగోలుదారుల ఆందోళన


ప్లాట్ల వద్ద ఆందోళన చేస్తున్న కొనుగోలు దారులు

ముథోల్: మండలంలోని తరోడా గ్రామంలో సర్వే నంబర్ 281లో 2018 ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ప్లాట్లను కొనుగోలు చేసిన లబ్ధిదారులు తమకు న్యాయం చేయాలని బుధవారం ఆందోళనలు చేశారు. వివరాల ప్రకారం... ఆర్మూర్‌కు ఎందిన నరేష్‌గౌడ్, భైంసాకు చెందిన రహీంలు 2018లో మండలంలోని పిప్రి, తరోడా, కుభీర్ మండలంలోని పలు గ్రామాల్లో లే అవుట్‌లు ఏర్పాటు చేసి తక్కువ ధరలకే ప్లాట్లను విక్రయిస్తామని ఆశచూపి పలువురి దగ్గరి నుంచి రూ. 2.5లక్షలను వసూలు చేశారని, ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయించాలంటే మరింత డబ్బులు కావాలని ఒత్తిడి తెస్తున్నారని బాధితులు వాపోయారు. దీంతోపాటు పలువురికి విక్రయించిన లేఅవుట్‌లను ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ అయ్యాయన్నారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయించాలంటే అదనంగా మరో రూ.లక్ష అడుగుతున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ అతికోద్దిన్‌ను విన్నవించామన్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు.

రైల్వేలైన్ సాధించే వరకూ పోరాటం

- సాధన కమిటీ ఆధ్వర్యంలో పట్టణ బంద్


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆదిలాబాద్: ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వే లైన్ సాధించే వరకూ పోరాటం కొనసాగుతుందని ఆదిలాబాద్ ఆర్మూర్ రైల్వే లైన్ సాధన కమిటీ చైర్మన్ కాశవేని నారాయణ యాదవ్ అన్నారు. సాధన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణ బంద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం సమయంలో ఆదిలాబాద్ బస్టాండ్ నుంచి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం నారాయణ యాదవ్ మాట్లాడుతూ ఆదిలాబాద్- ఆర్మూర్- రైల్వే లైన్ ప్రతిపాదనకు రానున్న కేంద్ర బడ్జెట్‌లో పూర్తిస్థాయిలో నిధులను కేటాయించి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకతీతంగా తాము పోరాటం చేస్తున్నామన్నారు. ప్రజా సమస్యల ప్రజల చిరకాలవాంఛ అయిన ఈ రైల్వే లైన్ సాధించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. అన్ని వర్గాల మద్దతు తమ పోరాటానికి ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నరేందర్, జాయింట్ సెక్రటరీలు శ్రీనివాస్ యాదవ్, మహేందర్, శోభ, దేవిదాస్ చారి, అగ్గిమల్ల గణేష్, అంజనేయులు ఉన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి


ఆందోళనకు దిగిన మృతుడి బంధువులు

ఆదిలాబాద్‌టౌన్: వైద్యుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలైందని రోగి బంధువులు ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ ప్రాంతంలోని ప్రైవేటు ఆస్పత్రిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. మృతుడి బంధువుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన పాషా చౌష్(55)ను సోమవారం రాత్రి లివర్ ఇన్‌ఫెక్షన్ ఉందని ఆస్పత్రిలో చేర్పించగా పరీక్షించిన వైద్యులు అన్ని రిపోర్టులు నార్మల్‌గానే ఉన్నాయని తెలిపారు. ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరోగ్యంగానే ఉన్నాడు. ఇంతలో ఆరోగ్యం విషమించడంతో పాషా బంధువులు వైద్యులను పిలిచేందుకు వెళ్లగా అందుబాటులో కానరాలేదు. పరిస్థితి విషమించి పాషా మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతో పాషా మృతిచెందాడని, మృతుడి కుటుంబీకులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి సిబ్బందితో వాగ్వాదానికి దిగగా విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ అశోక్ సంఘటనా స్థలానికి చేరుకుని నచ్చజెప్పడంతో వారు శాంతించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీ సోయం బాపూరావు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపీ సోయం

ఉట్నూర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. బుధవారం మండలంలోని శ్యాంపూర్ గ్రామంలో సంకల్ప వికసిత భారత్ కార్యక్రమంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, పీఎం జన ఆరోగ్య యోజన పథకం, ఇలా కుటుంబానికి రూ.5లక్షల ఆరోగ్య బీమా పథకం ఉందని తెలిపారు. సాధికారతపై మహిళలకు భరోసా పథకం కింద ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, పీఎం ముద్ర యోజన, సుకన్య సమృద్ధి యోజన ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. వైస్ ఎంపీపీ బాలాజీ, సర్పంచ్ మల్లిక, నాయకులు నందిరెడ్డి, కాటం రవీందర్, మాజీ సర్పంచ్ జాదవ్ జగదీశ్, సుదర్శన్ ఉన్నారు.

ఓటుతోనే సుపరిపాలన..



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలు అన్నపూర్ణబాయి. వయసు 104సంవత్సరాలు. భైంసా పట్టణానికి చెందిన ఈ మహిళ ఇప్పటి వరకు అన్ని రకాల ఎన్నికల్లో ఓటు వేసింది. వార్డ్ మెంబర్ స్థాయి నుండి ఎంపీ ఎన్నికల వరకు ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకుంది. అయితే వయస్సు పైపడటంతో ఇటీవల నిర్వహించిన శాసనసభ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకుంది. ఇలా ప్రజాస్వామ్యంలో విలువైన ఓటు హక్కును ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని ఆమె చెబుతోంది. ఈవిడ ఓటుహక్కును వినియోగించుకుని అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది.

– నిర్మల్‌ఖిల్లా

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశం భారతదేశం. దేశంలో అర్హులైన ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా భారత ప్రభుత్వం జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రారంభించింది. ఓటర్లందరూ పోలింగ్‌లో పాల్గొనేలా చేయడమే ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. మన దేశంలో ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటారు. 2011 నుంచి ఈ జాతీయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. జాతీయ ఓటర్ల దినోత్సవం అనే భావన 2011లో తెరపైకి వచ్చింది. అదే ఏడాది జనవరి 25న 'జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని' అప్పటి రాష్ట్రపతి ప్రతిభాదేవి పాటిల్ ప్రారంభించారు. 1950లో ఈ రోజున ఎన్నికల కమిషన్‌ను ఏర్పాటు చేసినందున దీనిని జనవరి 25న జరుపుకుంటారు. ఈ రోజున ఓటర్లకు తమ ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తారు.. అప్పటినుంచి భారత ఎన్నికల సంఘం జనవరి 1నాటికి 18 ఏళ్లు నిండిన అర్హులైన ఓటర్లందరినీ గుర్తించి, వారిని నమోదు చేస్తూ వస్తోంది. వారికి ఏటా జనవరి 25న ఓటరుగుర్తింపు కార్డులు అందజేస్తుంది. ఈ నేపథ్యంలో నేడు(జనవరి 25న) 14వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...

జాతీయ ఓటరు దినోత్సవం లక్ష్యాలివే..

ఓటరు అవగాహనను పెంపొందించడం, జాతీయ ఓటరు దినోత్సవం ఎన్నికల ప్రక్రియ, ఓటరు నమోదు విధానాల ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం..సమ్మిళిత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం. కులం, లింగం లేదా సామాజిక ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా అర్హులైన ఓటర్లందరి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం.

ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ..

ఓటరు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా, జాతీయ ఓటర్ల దినోత్సవం భారతదేశం యొక్క ప్రజాస్వామ్య విలువలను సమర్థిస్తుంది. దేశం యొక్క పాలనను రూపొందించడంలో ప్రతి వ్యక్తి ఓటు యొక్క శక్తిని తెలియజెప్పడం.

తొలి ఓటుహక్కును వినియోగించుకున్న



భారత రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం 18ఏళ్ల వయసు ఇటీవల పూర్తి కావడంతో ఓటును నమోదు చేసుకున్నా. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారిగా ఓటు హక్కును వినియోగించుకున్నాను. ఓటరుగా రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్యయుత ఓటుహక్కును అందరూ సక్రమంగా వినియోగించుకోవాలి.

– గాండ్ల లక్ష్మణ్, కౌట్ల(బి), మం॥ సారంగపూర్

ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి...

జనవరి 25న 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని శాఖల అధికారులు ఉద్యోగులు ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేయాలి. ప్రతి ఒక్క ఓటరు భారత ప్రజాస్వామ్యానికి కీలకం. ఓటర్లను చైతన్యవంతం చేసే కార్యక్రమాలను చేపట్టాలి. ఓటు యొక్క ప్రాధాన్యతను ప్రజలకు, పౌరులకు అధికారులు తెలియజెప్పాలి. ఈ మేరకు ఇప్పటికే తగిన ఉత్తర్వులను జారీచేశాం.

– ఆశిష్ సంగ్వాన్, కలెక్టర్, నిర్మల్

కారు ఢీకొని ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ సమీపంలో కేసీబీ గార్డెన్‌కు వెళ్లే రోడ్డు మార్గంలోని జాతీయ రహదారిపై అదే కాలనీకి చెందిన సురేష్‌కు బుధవారం కారు ఢీకొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... మావల వైపు స్కూల్‌కు పిల్లల కోసం ద్విచక్ర వాహనంపై సురేశ్ వెళ్తుండగా ఇదే క్రమంలో రంగ్ రూట్‌లో వచ్చినా కారు ఢీ కొట్టింది. దీంతో సురేశ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

కుంటాల: మండల కేంద్రంలో గత డిసెంబర్ 29న జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. కుంటాలలోని దాసరి శివలింగం ఇంట్లోని హుండీలో సుమారు రూ.10వేల నగదును ఎత్తుకెళ్లారు. ఈ నెల 9న బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకాలోని తొటాంబ గ్రామానికి చెందిన జాదవ్ మంగీలాల్‌ను పట్టుకుని బుధవారం కోర్టులో మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

భరోసా సెంటర్‌లో ఉద్యోగావకాశాలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న భరోసా సెంటర్‌లో నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఒక ప్రకటనలో బుధవారం పేర్కొన్నారు. ఫిబ్రవరి 1 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హతగల యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌లో వివిధ కేటగిరిల్లో 5 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. కౌన్సిలర్ కమ్ సెంటర్ కోఆర్డినేటర్ 1, సపోర్ట్ పర్సన్స్ 2, రిసెప్షనిస్ట్ 1, ఏఎన్ఎం 1 పోస్టులు ఉన్నట్లు పేర్కొన్నారు. కౌన్సిలర్ కమ్ సెంటర్ కోఆర్డినేటర్‌కు నెలకు రూ.25వేల వేతనం, వయస్సు 25 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. విద్యార్హత ఎంఎస్సీ, ఎంఏ సైకాలజీ, మాస్టర్ ఆఫ్ సోషల్‌వర్క్ కలిగి ఉండాలని తెలిపారు. సపోర్ట్ పర్సన్ వయస్సు 25 నుంచి 35లోగా ఉండాలని, వేతనం రూ.20వేలు ఉంటుందని, విద్యార్హత సోషల్ వర్క్, చైల్డ్ డెవలప్‌మెంట్, సైకాలజిస్ట్ పోస్టు గ్రాడ్యుయేట్ కలిగి ఉండాలని తెలిపారు. రిసెప్షనిస్ట్ కోసం 25 నుంచి 35 సంవత్సరాల వయస్సు, వేతనం రూ.15వేలు ఉంటుందని, విద్యార్హత గ్రాడ్యుయేట్ కంప్యూటర్, అకౌంటింగ్ పరిజ్ఞానం కలిగి ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఏఎన్ఎం పోస్టు కోసం 25 నుంచి 30 ఏళ్లలోపు ఉండాలని, వేతనం రూ.16వేలు, విద్యార్హత బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం చేసి ఉండాలని తెలిపారు. వివరాలకు సెల్: 8712566241పై సంప్రదించాలన్నారు.

పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌లోని కాకతీయ పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ఫీజు చెల్లించలేదని పరీక్ష రాయించకుండా గేటుబయట నిలుచోబెట్టడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘాలతో కలిసి నిరసన తెలిపారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులకు కనీస విద్యార్హత లేదని, ఇంటర్, డిగ్రీ చదివిన వారితోనే బోధన చేయిస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేలల్లో ఫీజులు తీసుకొని నాణ్యమైన విద్యాబోధన చేయడం లేదని ఆరోపించారు. ఆందోళన చేపట్టడంతో పాఠశాలకు డీఈఓ ప్రణీత, ఎంఈఓ జయశీల అక్కడికి చేరుకున్నారు. విద్యార్హత లేని వారిని తొలగించాలని డీఈఓ ఆదేశించారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వివాదం సద్దుమనిగేలా చర్యలు చేపట్టారు.